# బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాల మైండ్ బ్లాక్

మిరుదొడ్డి, అక్టోబర్ 17 : సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోతో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మైండ్ బ్లాక్ అయ్యిందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొగుళ్ల ఐలయ్య అన్నారు. మంగళవారం మిరుదొడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దూర దృష్టితో ఆలోచించి తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న బడుగు, బలహీన వర్గాలకు లబ్ధి చేకూరేలా 'కేసీఆర్ బీమా-పేదలకు దీమా' అనే పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రజల నుంచి సీఎం కేసీఆర్‌కు వస్తున్న ఆదరణతో ప్రతిపక్ష నాయకులు తలలు పట్టుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా కారు స్పీడ్‌ను తట్టుకునే శక్తి వారికి లేదన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ యువత విభా గం మండల అధ్యక్షుడు కుమార్, నాయకులు రమేశ్, ఎల్లం, సాయికుమార్, కనకయ్య పాల్గొన్నారు.



మిరుదొడ్డి : సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్య

**పేదల బతుకులు మార్చే మ్యానిఫెస్టో..**

జగదేవ్‌పూర్, అక్టోబర్ 17 : సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో పేదల బతుకులు మార్చేలా ఉందని మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎక్బాల్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ అన్నపూర్ణ పథకం ద్వారా అందరికీ సన్నబియ్యం, ఆసరా పెన్షన్ రూ.2016 నుంచి రూ.5016 పెంచి దశల వారీగా అందజేయనున్నట్లు తెలిపారు. రైతు బంధు పెంపు ద్వారా అన్నదాతలకు అండగా నిలవడం, పేద మహిళలకు నెలకు రూ.3 వేలు ఇవ్వడం, రూ.400కే వంట గ్యాస్ సిలిండర్ అందించడంతో పేదల బతుకుల్లో వెలుగులు నింపనుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏ ఒక్క హామీ అమలు చేయడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధిస్తారని తెలిపారు.



ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డికి అందజేస్తున్న గజ్వేల్ నియోజకవర్గ బ్రాహ్మణులు

## సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలిపిన బ్రాహ్మణులు

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 17 : సీఎం కేసీఆర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తామని గజ్వేల్ నియోజకవర్గ బ్రాహ్మణులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. నాచారం ఆలయ మాజీ చైర్మన్ హన్మంతరావు, దర్శనం ఎడిటర్ మరుమాముల వెంకటరమణశర్మ, రాములుశర్మ, కిరణ్‌కుమార్ తదితరులు ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని మంగళవారం గజ్వేల్‌లో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, అత్తెల్లి శ్రీనివాస్, ఆత్మకమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 12వ వార్డులో ఇన్‌చార్జిల నియామకం



ఇన్‌చార్జిలను నియమిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుబ్బాక టౌన్, అక్టోబర్ 17 : దుబ్బాక మున్సిపాలిటీలో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేస్తున్నారు. మంగళవారం 12వ వార్డులో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, కౌన్సిలర్ బట్టు యాదమ్మ ఎల్లం, సీనియర్ నాయకులు కొత్త కిషన్ రెడ్డి, బండి రాజు, తుమ్మ శేఖర్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి వంద ఓట్లకు ఒకరిని ఇన్‌చార్జిగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపునకు ప్రతిఒక్కరూ ప్రణాళికబద్ధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు స్వామి, శ్రీను, వెంకట్, మల్లేశం, నర్సింహులు, అఖిల్, స్వామి, బాల్‌లింగం పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్లు

రాయపోల్, అక్టోబర్ 17 : మండలంలోని పెద్దఆరెపల్లి గ్రామంలో మంగళవారం మెడిసిటీ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు బీపీ, షుగర్, కంటి, చెవి, ముక్కు, గొంతు, గడ్డలు, థైరాయిడ్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో దవాఖాన మార్కెటింగ్ సుధాకర్, డాక్టర్లు వంశీధర్, భారత్‌చంద్ర, సర్పంచ్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

రాయపోల్, అక్టోబర్ 17 : మండలంలోని మంతూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జీడిపల్లి వెంకట్‌రెడ్డి అకాల మరణం పార్టీకి తీరనిలోటని దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మామిడి మోహన్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, జడ్పీటీసీ యాదగిరి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి వెంకట్‌రెడ్డి గురికావడంతో దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ పర్వేజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, ఆత్మకమిటీ డైరెక్టర్ మురళి, నాయకులు ఉన్నారు.

# జనగామ సభతో ప్రతిపక్షాలకు వణుకు

**బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతాలుయాదవ్**

చేర్యాల, అక్టోబర్ 17 : జనగామలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభతో ప్రతిపక్ష నాయకులకు వణుకు మొదలైందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనగామ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ చేర్యాల, జనగామ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ప్రకటించడంతో ప్రతిపక్షాల గొంతులు మూగబోయాయని తెలిపారు. జనగామ, చేర్యాల ప్రాంతాల్లో నెలకొన్న సమస్యతోపాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సభలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. చేర్యాల ప్రాంతంలో ప్రధాన డిమాండ్‌గా ఉన్న రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశంపై సీఎం కేసీఆర్ స్పందించిన తీరుతో అన్నివర్గాలు సంతృప్తి చెందినట్టు తెలిపారు. ప్రతిపక్ష నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మిరుదొడ్డి, అక్టోబర్ 17 : మండల కేంద్రమైన మిరుదొడ్డిలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) నవీన్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా మిరుదొడ్డి టౌన్‌లోని డివైడర్స్ మధ్య హనుమాన్ ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

# మానవత్వం చాటుకున్న మున్నూరుకాపు సంఘం



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

జగదేవ్‌పూర్, అక్టోబర్ 17 : మండలంలోని తీగుల్ గ్రామంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఇటీవల చెరువు ఘాట్ వద్ద మెట్లను శుభ్రం చేసే క్రమంలో చెరువులో పడి ముగ్గురు సఫాయి కార్మికులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ మున్నూరుకాపు సంఘం నాయకులు మంగళవారం మృతులు యాదమ్మ, భారతి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.6 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. మరో మృతుడు బాబు కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా కాపు సంఘం మండల అధ్యక్షుడు మల్లేశం, మండల మాజీ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి నరేందర్ నాయకులు మాట్లాడుతూ నిత్యం గ్రామాన్ని పరిశుభ్రం చేసే కార్మికులు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కనకయ్య, సభ్యులు కనకరాజు, నరేశ్, నాగరాజు, నరేందర్, భాస్కర్, రాములు, లక్ష్మణ వెంకటేశ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్‌లో చేరిన భూపాల్




ఎమ్మార్పీఎస్‌లో చేరుతున్న భూపాల్

మిరుదొడ్డి, అక్టోబర్ 17 : దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల భూపాల్ మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గుర్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ సమక్షంలో దండోరాలో చేరారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో దండోరా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కల్యాణి అలంకారంలో దర్శనమిచ్చిన గజ్వేల్ మహంకాళి అమ్మవారు





అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన సంతోషిమాత అమ్మవారు

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 17 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గజ్వేల్ మహంకాళి అమ్మవారు భక్తులకు కల్యాణి రూపంలో దర్శనమిచ్చారు. 1116 నిమ్మకాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సంతోషిమాత ఆలయంలో అమ్మవారి మూలమూర్తి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్సీ సంతోష్ పాల్గొన్నారు.



సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి

## గ్రామాల్లో డీఎల్‌పీవో పర్యటన

హుస్నాబాద్ రూరల్, అక్టోబర్ 17 : మండలంలోని పోతారం(ఎస్), వంగరామయ్యపల్లి, మీర్జాపూర్ గ్రామాల్లో మంగళవారం డీఎల్‌పీవో వీరభద్రయ్య పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీల్లోని రికార్డులను పరిశీలించి విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని అధికారులకు సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో